## క్లుప్తంగా

### ఏయూ వీసీకి అభినందలు



ఏయూ వీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

**సింహాచలం:** జాతీయస్థాయిలో ఆంధ్రా యూనివర్సిటీకి 9వర్యాంక్ రావడానికి కృషి చేసిన ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి శనివారం 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు–నేడు భాగంలో ఆంధ్రాయూనివర్సిటీని విశేషంగా తీర్చిదిద్దారని కొనియాడారు. తక్కువ కాలంలో విద్యా విధానంలో పలు మార్పులు తీసుకొచ్చి వర్సిటీ కీర్తిని పెంచేలా ప్రసాదరెడ్డి కృషి చేశారన్నారు.

### కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



రామాయణంపై అవగాహన కల్పిస్తున్న మందారపు సత్యనారాయణ తదితరులు

**సింహాచలం:** అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు రామాయణం విశిష్టతను వివరించారు. ఆధ్యాత్మిక ప్రవచన కర్త, జ్యోతిష్య పండితుడు మందారపు సత్యనారాయణ రామాయణంలోని విశిష్ట పాత్రలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరమ్ కమిటీ అధ్యక్షుడు బి.బి. రాజేంద్రప్రసాద్ నీతి కథలు చెప్పారు. క్రికెట్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం, ఉద్యోగి ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ఆటో డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్

**సింహాచలం:** ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం సాగించాలని ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ వాహనదారులకు సూచించారు. పెందుర్తిలో శనివారం ఆయన వాహనదారులకు రహదారి భద్రత నియమావళిపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాన్ని నడపడం ప్రమాదకరమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### డ్యాన్స్ అదరహో



డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**సబ్బవరం:** సబ్బవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వి.శిరీష ఆధ్వర్యంలో శనివారం బుక్ రీడింగ్,డ్యాన్స్ షో నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### రాణించిన యశ్వంత్, చంటి

**విశాఖ స్పోర్ట్స్ :** వీడీసీఏ డివిజన్ లీగ్‌లో భాగంగా మూడో డివిజన్‌లో జరిగిన పోటీల్లో యశ్వంత్, చంటి రాణించి జట్టుకు విజయాన్నందించారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో సోలో సీసీతో తలపడిన సిటీ సీసీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 264 పరుగులకు ఆలౌటైంది. యశ్వంత్ (107)సెంచరీ నమోదు చేయగా వరుణ్ 77 పరుగులు చేశాడు. ప్రతిగా సోలోసీసీ 185 పరుగులకే ఆలౌటైంది. చంటి 44 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు.



# తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

- ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి
- మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలు ప్రస్తావించిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

**పరవాడ:** వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలో మరమ్మతులకు గురైన మంచినీటి పథకాలను తక్షణమే వినియోగంలోకి తేవాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టిసారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలతో పాటు సమస్యలను సభ్యులు లేవనెత్తారు. ఎంపీపీ మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన సమస్యలను లిఖిత పూర్వకంగా అధికారులకు సమర్పిస్తే వెంటనే చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సభ్యులు ప్రస్తావించిన అంశాలు**

- పి.బోనంగిలో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ కోరారు. తహసీల్దార్ ప్రకాశరావు స్పందిస్తూ త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
- ఊటగెడ్డ సమీపంలో ఓ ప్రైవేటు లేఅవుట్ యాజమాన్యం ప్రభుత్వ స్థలంలో రోడ్డు వేసినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదని భర్నికం సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్ ఆరోపించారు. సమస్య కోర్టు పరిధిలో ఉన్నందువల్ల ఎలాంటి చర్యలు తీసుకోవడం సాధ్యంకాదని తహసీల్దారు ప్రకాశరావు చెప్పారు.
- రావాడలో అటవీశాఖ ఆధీనంలో ఉన్న భూమిపై జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని ప్రజాపయోగ కార్యక్రమాలకు వినియోగించాలని సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు కోరారు.
- ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టును స్థానికులకు కేటాయించాలని సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని సబ్బవరం ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి చెప్పారు.
- జల్‌జీవన్‌మిషన్ పథకంలో మండలంలో ఇప్పటి వరకు 25 గ్రామాల్లో ఇంటింటి కుళాయి పనులు పూర్తి చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ చెప్పారు. 18 గ్రామాల్లో పనులు చురుగ్గా జరుగుతున్నాయని, మిగిలిన 17 గ్రామాలకు టెండర్లు ఖరారు కాలేదని ఏఈ చెప్పారు.

# సంక్షేమ వారధులు వలంటీర్లు

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఉత్తమ గ్రామ వలంటీర్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఉత్తమ వలంటీర్లతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ రాజు

**పరవాడ:** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేసి ప్రతీ ఇంట్లో వెలుగులు నింపుతున్న వలంటీర్ల సేవలు అమోఘమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కొనియాడారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది ప్రకటించిన అవార్డులను వలంటీర్లకు ఎమ్మెల్యే ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థలో వలంటీర్లే కీలక భూమిక పోషిస్తున్నారన్నారు.వారికి కేటాయించిన యాభై ఇళ్లకు వెళ్లి వారిలో ఓ కుటుంబ సభ్యునిగా మమేకమై జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దారు వి.ప్రకాశరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బి.అప్పలరాజు, బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. ఉదయం 9.30గంటల నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఉభయదాతలతో కల్యాణ మండపం కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

**వైభవంగా గరుడసేవ**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ అనంతరం హారతులు అందజేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అర్చకులు పెదరాజు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

### ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

**సింహాచలం:** పెందుర్తి మండలం రాంపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో చేరేందుకు బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.జి.రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 20 సీట్లు, బైపీసీలో 20 సీట్లు ఉన్నాయన్నారు. ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదని.. పదోతరగతి మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కేటగిరీల వారీగా రిజర్వేషన్ అమలు చేస్తామని తెలిపారు. వచ్చేనెల 14వ తేదీతో మొదటి దశ అడ్మిషన్స్ పూర్తి అవుతాయని పేర్కొన్నారు.

### పరవాడ జీజే కళాశాల ప్రిన్సిపాల్‌గా నారాయణరావు



నారాయణరావు

**పరవాడ:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.వి.నారాయణరావు బాధ్యతలు స్వీకరించారు. నారాయణరావు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్‌డీఎల్ కుమారి నుంచి నారాయణరావు చార్జి తీసుకున్నారు. కళాశాలలో నాణ్యమైన విద్య అందే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



అడవివరంలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కొలుసు ఈశ్వరరావు, వరహానరసింహం

**సింహాచలం:** ఇదేం కర్మ రాష్ట్రానికి అంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దొంగ యాత్రలు చేస్తున్నారని 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన సెంటు భూమి శవాన్ని పూడ్చడానికి కూడా సరిపోదని పెందుర్తిలో ఇటీవల చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. వార్డు పరిధి అడవివరం కూడలిలో శనివారం చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు మాట్లాడుతూ పేద ప్రజలకు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తున్నారన్నారు. అది ఓర్వలేని చంద్రబాబు సెంటు స్థలం శవం పూడ్చడానికి సరిపోతుందనడం ఆయనలోని అహంకారానికి నిదర్శనమన్నారు. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు పాలనలో పేదలకు ఏమి న్యాయం చేశారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుతోపాటు టీడీపీ నాయకులను ప్రజలు తరిమికొట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30లక్షల కుటుంబాలకు స్థిర నివాసాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తే బాబు చూడలేక విమర్శలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పీతల అప్పలరాజు, లంక సత్తిబాబు, బోర కృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, కె.సింహాద్రి, తెడ్లపు మహేష్, ఎస్. అప్పారావు, రచ్చ వర్మ, దొంతల సంతోష్, టి.రాము తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పరవాడ:** తంతడి-నాయుడుపాలెం రహదారిలో మెట్టపాలెం బాలికల వసతి గృహం సమీపంలో శనివారం ఉదయం ట్రాక్టర్ బైక్‌ను ఢీ కొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన పెంటారావు(40) శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో బైక్‌పై మెట్టపాలెం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో వాడచీపురుపల్లి నుంచి తంతడి వైపు వెళుతున్న ట్రాక్టర్ బలంగా ఢీ కొట్టి రోడ్డు సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పెంటారావు రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటన స్థలాన్ని ఎస్ఐ తేజేశ్వరరావు, కానిస్టేబుల్ శ్రీరామ్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి పీఎం అనంతరం బంధువులకు అప్పగించామని ఎస్ఐ తేజేశ్వరరావు చెప్పారు.

# హార్బర్ ఆధునికీకరణకు సహకరించండి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

**మహారాణిపేట :** ఫిషింగ్ హార్బర్‌ను రూ. 152 కోట్లతో ఆధునీకరించేందుకు రూపొందించిన సమగ్ర ప్రణాళిక అమలుకు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను నాయకులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో హార్బర్ హైలెవల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పోర్టు అధికారులు, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు, మత్స్యకార సంఘాల నాయకులు వాసుపల్లి జానకీరామ్, బర్రె కొండబాబు, చింతపల్లి వీరన్న, దూడ పోలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునికీకరణకు టెండర్లు పిలిచామన్నారు. కొన్ని పనులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు.

### 352 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లి గోపి

**పరవాడ:** మండలంలోని గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో స్ఫూర్తి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లి గోపి ప్రారంభించారు. శిబిరంలో 352 మంది సేవలు పొందారు. కంటి ఆపరేషన్లు అవసరమైన రోగులకు అసోసియేషన్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లి రామారావు, నాయకులు పైల అప్పారావు, పోలిరెడ్డి అప్పారావు, రొంగలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 'విశాఖ ఉక్కును ప్రభుత్వ సంస్థగా కొనసాగించాలి'





దీక్షలో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 828వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో ఉక్కు కర్మాగారంలోని పలు విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైల్వేజోన్ ఇవ్వకుండా, ప్రత్యేకహోదా ప్రకటించకుండా ఎన్నికల హామీని తుంగలో తొక్కిన బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్మిక హక్కులను నేరవేర్చని గత ప్రభుత్వాలు ఇప్పటికీ దీనస్థితిలో ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. కార్మిక శక్తిని, ప్రజల ఆందోళనను గుర్తించి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు, మద్దతుదారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల సంబరం



ఎర్నిమాంబ ఘటాలతో వస్తున్న భక్తులు



రథంపై ఎర్నిమాంబ ఉత్సవ విగ్రహం

**కంచరపాలెం:** జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం అచ్చియ్యమ్మపేట, కాన్వెంట్ కూడలిలో గల ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ ఆలయం వద్ద ఎర్నిమాంబ అమ్మవారి ఘటాలతో బయలుదేరారు. కొబ్బరితోట, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం పుట్టబంగారం వద్దకు అమ్మవారి ఘటాలను చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. అనంతరం ఆలయం వద్ద అగ్నిగుండాలపై భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవదాయ శాఖ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన జాతర నిర్వహించనున్నారు.

### పాలిసెట్‌లో రాకేష్‌కు 190వ ర్యాంకు



చొప్ప రాకేష్

**సబ్బవరం:** సబ్బవరం మండలం జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని వెదుళ్లనరవ గ్రామానికి చెందిన చొప్ప రాకేష్ పాలిసెట్‌లో మెరిశాడు. పాలిసెట్‌లో 114/120 మార్కులు రావడంతో రాష్ట్రస్థాయిలో190వ ర్యాంకు వచ్చింది. రాకేష్ తండ్రి కనకరాజు వ్యవసాయ కూలీ కాగా తల్లి వెంకటలక్ష్మి గృహిణి. గాజువాక చైతన్యలో 10వ తరగతి చదివాడు.పాలిటెక్నిక్ పూర్తి చేసి ఐఐటీలో మంచి ర్యాంకు సాధించడమే లక్ష్యమని రాకేష్ చెబుతున్నాడు. మంచి ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులకు అండగా ఉంటానని తెలిపాడు.

# 'బీజేపీ ఎంపీ, మంత్రిని అరెస్టు చేయాలి'



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

**సీతమ్మధార/మహారాణిపేట :** దేశానికి పేరు, ప్రతిష్టలు తెచ్చిన భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను, హర్యానా మంత్రి సందీప్‌సింగ్‌ను అరెస్ట్ చేసి, పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సంఘీభావంగా శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 28 రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో మల్లయోధులు పోరాటం చేస్తున్నా అక్కడే ఉన్న బీజేపీ ప్రభుత్వానికి చలనం లేదన్నారు. రెజ్లర్లపై ఫిర్యాదును నమోదు చేయకుండా తిరస్కరించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం వెంటనే మల్లయోధుల సమస్య పరిష్కరించాలన్నారు. నిరసనకారులు, జర్నలిస్టులపై క్రూరమైన దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, సీఐటీయూ కార్యదర్శి పి.మణి, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్ రాజు, కె.సంతోష్, జోనల్ ప్రెసిడెంట్ కామేశ్వరి, ఐద్వా నాయకులు పుష్పాంజలి, కె.వేణు, వరలక్ష్మి, బి.భారతి, ఆర్.విమల, మమత, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# ఉదయం 6 గంటలకే క్లాప్ వాహనాలు వెళ్లాలి




క్లాప్ వాహనాల లాగ్‌బుక్ పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్

**జగదాంబ:** ఉదయం 6 గంటలకే క్లాప్ వాహనాలు చెత్త సేకరణకు ఇంటింటికీ వెళ్లాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్ అన్నారు. శనివారం ఆయన 31వ వార్డులోని ఆంథోనీనగర్, ఎస్‌బీఐ కాలనీ, చాకలిపేట ప్రాంతాల్లో పర్యటించారు. జీవీఎంసీ లక్ష్యం దిశగా క్లాప్ వాహనాలు నిర్దేశించిన లక్ష్యంతో పని చేయాలన్నారు. శానిటరీ సెక్రటరీలు బాధ్యతగా విధులు నిర్వహిస్తూ క్లాప్ వాహనాల రాకపోకలు రికార్డు చేయాలన్నారు. రహదారులు, కాలువల్లో చెత్త ఉండకూడదన్నారు. ప్రతి ఇంట్లో మూడు రకాలు డస్ట్‌బిన్లు ఉండేలా చూడాలన్నారు. అదే విధంగా వార్డులో వాణిజ్య సముదాయలు, చిరు వ్యాపారులు కూడా తప్పకుండా బిన్లు ఉపయోగించేలా చూడాలని తెలిపారు. ఉదయాన్నే పారిశుధ్య కార్మికులతో పాటు సెక్రటరీలు కూడా విధులకు హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# 'ఫ్యామిలీ డాక్టర్'పై అందరికీ అవగాహన

**మహారాణిపేట:** ఫ్యామిలీ డాక్టర్ విధానంపై అందరికీ అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. విద్యుత్‌నగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. అక్కడి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది అంతా సమయపాలన పాటించాలని, విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బర్త్ ప్లానింగ్, హైరిస్క్ గర్భిణుల కోసం వైద్యులు సలహాలు ఇవ్వాలని, ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేలా ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో చెప్పారు.

# కలెక్టర్‌కు రెవెన్యూ ఉద్యోగుల సన్మానం



కలెక్టర్ మల్లికార్జునను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

**సీతంపేట:** కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను విశాఖ రెవెన్యూ ఉద్యోగులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ భవిత కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన నిరామయ ఆరోగ్య బీమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల ఆయన ప్రారంభించిన సంజీవని నిధి–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌లో ఉద్యోగులను భాగస్వామ్యం చేయడం, ఆ నిధితో దివ్యాంగులకు ఆరోగ్య బీమా కల్పించి, ఇటువంటి గొప్ప కార్యక్రమంలో పరోక్షంగా ఉద్యోగులను భాగస్వామ్యం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్యామ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్మ, సెక్రటరీ సిహెచ్.రమేష్, ఈసీ మెంబర్స్ సుధాకర్, మహేష్, కలెక్టర్ ఏవో ఈశ్వరరావు పాల్గొన్నారు.